ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ కడప యాజమాన్యం సెక్రటరీ జవాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కమలాపురం దర్గా వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సేవలకు సంబంధించిన వైద్య సేవలు ఉచితంగా అందించారు. ఉచిత వైద్య శిబిరానికి కమలాపురం పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 200 మందికి పైగా ప్రజలు హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలకు తొలగని గ్రహణం

- ప్రారంభానికి నోచని పులివెందుల, మదనపల్లి కళాశాలలు
- ప్రశ్నార్థకంగా రాజంపేట, ప్రొద్దుటూరు కళాశాలల ఏర్పాటు
- తొమ్మిది రకాల స్కూళ్లతో గందరగోళం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా విద్యా రంగంలో గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రాథమిక పాఠశాలల సంస్కరణల దగ్గర నుంచి ఉన్నత విద్యలో భాగమైన పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలు ప్రారంభానికి నోచకపోవడం, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడం వరకు తల్లికివందనం పథకం అమలు మినహా ఏడాది పాలన అసంతృప్తిని కలిగించింది. రెండేళ్లుగా మదనపల్లి మెడికల్ కళాశాలలో 150 సీట్లు, పులివెందుల మెడికల్ కళాశాలలో 100 సీట్లు వెరసి 500 మెడికల్ సీట్లు గల్లంతు కావడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట అప్పటి సర్కారు పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లు చేసింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి కూటమి ప్రభుత్వం పెండింగ్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయకుండా, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌తో అకడమిక్ ఇయర్ ప్రారంభించడంపై సంప్రదింపులు చేసి మెడికల్ కళాశాలలను ప్రారంభించడంలో ఘోర వైఫల్యం చెందడంపై విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది.

ప్రయివేటు మోజుతోనేనా!

కడప, అన్నమయ్య జిల్లాల్లోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి.ఆయా వైద్య కళాశాలలకు చెందిన పలువురు వైద్య నిపుణులు, అకడమిక్ సిబ్బంది, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బందిని కడప, తిరుపతి, నంద్యాల, రాజమండ్రి తదితర ప్రాంతాలకు బదిలీ చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఒక వైపు ఏటా 250 చొప్పున రెండేళ్లుగా మెడికల్ సీట్లను కోల్పోవడం, మరోవైపు ప్రభుత్వ వైద్యా సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతో వ్యవహరించడంపై సర్వాత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతోనే మెడికల్ సీట్లను కోల్పోయేలా చేశారనే వాదనకు బలం చేకూరడం గమనార్హం.

వైద్య కళాశాలల ఏర్పాటు హామీ అమలేదీ

ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేట, ప్రొద్దుటూరు పట్టణాల్లో మెడికల్ కళాశాలలను, రాయచోటి పట్టణంలో సైతం ప్రసూతి ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి పాలన ఏడాది గడిచినప్పటికీ హామీల అమలు ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. జిల్లాకు చెందిన ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు సైతం పదవులపై ఆశలతో హామీల అమలుపై ప్రశ్నించిన పాపానపోని పరిస్థితి ఏర్పడింది.

తల్లికి వందనంతో ఉపశమనం

తల్లికి వందనం పథకం అమలుతో కాస్త ఉపశమనం కలిగింది. జిల్లాలోని 2,41,119 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమచేస్తోంది. ఎన్నికల ముంగిట ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిలిపేసి, అధికారంలోకి వచ్చినప్పటికీ పాత బకాయిల చెల్లింపులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది బిటెక్, తదితర ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పంపిణీ నిలిచిపోవడంతో వ్యతిరేకత నివురుగప్పిననిప్పులా ఉంది. పాఠశాల విద్యలో సంస్కరణలతో గందరగోళం నెలకొంది. వైసిపి సర్కారు హయాంలో ఆరు పాఠశాలల వ్యవస్థ, ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది పాఠశాలల వ్యవస్థతో అయోమయం నెలకొంది. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఉపాధ్యాయుల బదిలీలు కొనసాగుతూనే ఉన్న నేపథ్య ంలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు, ఉర్దూ, తెలుగు పండిట్ ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెలకొంది.

సత్వరమే మెడికల్ కళాశాలను ప్రారంభించాలి

మదనపల్లి మెడికల్ కళాశాలను ప్రారంభించాలి. రెండేళ్లుగా వందలాది మెడికల్ సీట్లు కోల్పోయేలా చేయడం దారుణం. మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించకపోవడం దారుణం. ఎన్డీయే సర్కారు నిర్లక్ష్యం కార ణంగానే విద్యారంగానికి తీరని నష్టం వాటిల్లుతోంది.

- నరసింహ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు, అన్నమయ్య.

ప్రయివేటుకు అప్పగించడం తగదు

మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు దారాదత్తం చేయడం తగదు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. 50 శాతానికిపైగా పూర్తి చేసిన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శివప్రసాద్, బాస్ రాష్ట్ర అధ్యక్షులు, అన్నమయ్య.

వైద్య కళాశాలలకు నిధులు కేటాయించాలి

పులివెందుల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా అడ్మిషన్లు కోల్పోయిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా మేల్కొని సెప్టెంబర్ నుంచైనా అకడమిక్ ఇయర్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రాహుల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు, కడప.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- కడపఅర్బన్

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులైలో సమ్మె చేయనున్నారని, వారి సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటి అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి, సహాయ కార్యదర్శి ఇచ్చుడి ప్రకాష్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుంకర కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు చేసే సమ్మెకు పారిశుధ్య, డ్రైవర్స్, అదనపు కోవిడ్ కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములు అవుతారని చెప్పారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెలో వీరంతా భాగస్వాములు అవుతారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులకు వర్తించవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం వర్తింపచేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల డేటాలో తప్పులు ఉన్నాయని, వాటిని సవరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీజిఎల్ఐ బాండ్స్ ఇవ్వడం లేదని, కోవిడ్‌లో పనిచేసే కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలలో ఒకరికీ ఉద్యోగాలు ఇవ్వలేదని, వెంటనే నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్మికుల నివాస ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, లేనిపక్షంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మళ్లీ టిడిపి జెండాల తొలగింపు

- పోలీసుల అదుపులో నలుగురు
- వీరిలో ముగ్గురు మైనర్లు
- అన్యాయంగా అరెస్టు చేశారంటున్న తల్లిదండ్రులు
- డిఎస్‌పి జోక్యంతో సద్దుమణిగిన సమస్య

తల్లిదండ్రులతోమాట్లాడుతున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టిడిపి మహానాడు సందర్భంగా జెండాలు, తోరణాలు తొలగించడంతో 18 మందిపై కేసు నమోదు చేసి 13 మందిని రిమాండ్ కు పంపిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి పట్టణంలోని కదిరి రింగ్ రోడ్డులో టిడిపి జెండాలు చించి కాల్చారు. అడ్డు వచ్చిన వ్యక్తిపై దాడి చేయడంపై ఫిర్యాదు రావడంతో నలుగురిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నారు. మైనర్ల తల్లిదండ్రులు తమ పిల్లలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. డిఎస్‌పి మురళీనాయక్ వారితో మాట్లాడి తప్పు చేయకపోతే పిల్లలను ఇంటికి పంపుతామని, దీని వెనుక ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తి లేదన్నారు. న్యాయం చేయడానికి పోలీసులు ఉన్నది అని అన్యాయాన్ని పోలీసులు ఎవరు ప్రోత్సహించరని చెప్పడంతో మహిళల తల్లిదండ్రులు స్టేషన్ నుంచి వెళ్లిపోయారు.

పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటాం : డిఎస్‌పి

మహానాడు సందర్భంగా టిడిపి జెండాలు తొలగించిన కేసులో పరారీలో ఉన్న ఐదుగురిని త్వరలో పట్టుకుంటామని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహానాడు సందర్భంగా ప్రభుత్వ స్థలాల్లో టిడిపి నాయకులు జెండాలు , తోరణాలు కట్టడం జరిగిందని, వీటిని వైసిపికి చెందిన నాయకులు చించి వేయడం తోపాటు అడ్డు వచ్చినా టిడిపి నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి పై దాడి చేశారని చెప్పారు. విజయ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేశామని వారిలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తోపాటు 13 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మరో ఐదుగురైన కడప ఎంపీ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి, గంగిరెడ్డి, జగదీష్ రెడ్డి, విక్రమ్, విజయ శేఖర్ రెడ్డి కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తామని డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ చాంద్ బాషా పాల్గొన్నారు.

చిత్తూరు, కడప జట్ల ఘన విజయం

తలపడుతున్న అనంతపురం, చిత్తూరు జట్లు

లోహిత్ (125 నాటౌట్)

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచుల్లో చిత్తూరు, కడప జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 7 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటిం గ్‌కు దిగిన అనంతపురం జట్టు 55.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఆ జట్టులోని భువనేశ్వర్ 65, జయంత్‌కృష్ణ 41 పరు గులు చేశారు. చిత్తూరు జట్టులోని చరణ్ 3, ప్రకాష్ రాజ్ 3 వికెట్లు తీసు కున్నారు. అనంతరం 230 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టు లోని లోహిత్ లక్ష్మి నారాయణ అద్భు తంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 14 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 125 పరుగులు చేసి ఆజే యంగా నిలిచాడు. వేదాంత్ 32 పరుగులు చేశాడు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 36 పరుగుల తేడాతో కడప జట్టు విజయం సాధిం చింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రణధీర్‌రెడ్డి 65, ఆర్థిత్‌రెడ్డి 61(నాటౌట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 3, తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసు కున్నారు. అనంతరం 244 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 77, మన్విత్ 38 పరుగులు చేశారు. కడప జట్టు లోని ఆర్థిత్‌రెడ్డి 2, ధీరజ్ కుమార్‌రెడ్డి 2, హృతిక్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు కడప జోన్‌లో పారదర్శకంగా నిర్వహించాలని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ ఆర్‌డి డాక్టర్ రామ గిడ్డయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జోన్4 లోని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు కలిసి బదిలీల ప్రక్రియలో భాగంగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిదేళ్ల మినహాయింపును వారు ఆఫీస్ బేరర్లుగా జాయిన్ అయినప్పటి నుంచి లెక్కించాలని కోరారు. జిఎడి సర్క్యులర్ మెవెలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. సంబంధిత కాపీలు అందించినట్లు చెప్పారు. సమావేశంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, అనంతపురం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సహా అధ్యక్షులు వి.దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, మాధవ్, జిల్లా కార్యదర్శులు డి.రవికుమార్, చంద్రమోహన్, జిల్లా నాయకులు బాలపులయ్య, హుసేన్ రెడ్డి, వేణుగోపాలరెడ్డి, ప్రవీణ్, రాంమోహన్, బాషా, ప్రభాకర్ రెడ్డి, నరసింహరెడ్డి, రత్నం, శివరామిరెడ్డి, పద్మనాభం, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

అంగన్వాడీలకు జీతాలు ఇవ్వండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : టిడిపి ప్రభుత్వం అంగన్వాడీలకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని ఎపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 13 ప్రాజెక్టులు ఉన్నాయని ఇందులో పనిచేస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అప్పుచేసి సెంటర్లను నడపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. పనిచేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ పెండింగ్ బకాయిలు, వేతనాల చెల్లింపులో ఎందుకు ఉండదని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపచేయాలని తెలిపారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని పేర్కొన్నారు.

ముగిసిన ఎస్‌జిటిల కౌన్సెలింగ్

ప్రజాశక్తి -కడప అర్బన్ : జిల్లా కేంద్రంలోని స్కౌట్ హాలులో నిర్వహిస్తున్న ఎస్‌జిటిల కౌన్సెలింగ్ శుక్రవారం నాటికి ముగిసింది. 1551 నుంచి 2122 వరకు కౌన్సెలింగ్ కొనసాగించారు. రాత్రి 8 గంటలకు దాదాపు 130 మంది ఉర్దూ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం నుంచి కడప ప్రొద్దుటూరులో పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఉంటుంది. ఈ ప్రక్రియలో విద్యాశాఖ అధికారులు, యుటిఎఫ్‌తో పాటు వివిధ ఉపాధాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌సి పరీక్షకు 127 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతూ ఉన్నాయి. శుక్రవారం ఉదయం 8 సెంటర్లు, మధ్యాహ్నం 8 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 1510 మంది హాజరు కావాల్సి ఉండగా 1415 మంది హాజరయ్యారు. 95 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1510 మంది హాజరు కావాల్సి ఉండగా 1478 మంది హాజరయ్యారు 32 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 3020 మంది హాజరు కావాల్సి ఉండగా 2893 మంది హాజరయ్యారు. 127 మంది గైర్హాజరయ్యారు.

బిసిలకు పింఛను ఎప్పుడిస్తారు?

- వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు శివరామ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్నశివరామ్

రాష్ట్రంలోని 50 సంవత్సరాల అర్హత కలిగిన బిసిలు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని, ఎప్పుడు అమలు చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు శివరామ్ ప్రశ్నించారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలోవిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యాబై సంవత్సరాలకు బిసిలందరికి రూ.4 వేల పెన్షన్ ఇస్తామని కూటమి నేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ హామీ ఏమైందని కూటమి నేతలను ప్రశ్ని ంచారు. బిసిలకు తప్పుడు హామిలిచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికా రంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న అమలు చేయకపోవడం బిసిలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా ముఖ్యమంత్రి అన్ని హామీలు చేశామని చెప్పడం విడ్డురంగా ఉందని తెలిపారు. ఇది మోసానికి పరాకాష్టగా ఉందని విమర్శి ంచారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ బిసిలకు ఇచ్చిన పెన్షన్ హామీని అమలు చేయాలని లేని పక్షంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, జిల్లా ఉపాధ్యక్షులు సుంకేశుల బాదుల్లా పాల్గొన్నారు.

డిఐపిఆర్‌ఒకు వీడ్కోలు

వేణుగోపాల్‌రెడ్డిని, మస్తాన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కడప : శ్రీ సత్య సాయి జిల్లా డిఐ పిఆర్‌ఒగా బదిలీపై పుట్టపర్తికి వెళ్తున్న వైఎస్ఆర్ కడప జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డిఐపిఆర్‌ఒ పి. వేణు గోపాల్‌రెడ్డిని అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మా నించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌరసబంధాల శాఖ కార్యాలయంలో పి. వేణుగోపాల్ రెడ్డికి, డివిజనల్ పిఆర్‌ఒ మస్తాన్ సాహె బ్‌కు, అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ జయశాంత శరీఫా ్ ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడుకోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ బదిలీ అయిన వారితో వారికి విధి నిర్వహణలో వారితో అనుభవాలు, అనుబంధాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇఐఇ శ్రీనివాసరావు, డివిజనల్ పిఆర్‌ఒ సునీల్ సాగర్, పిఆర్‌ఒ రవికుమార్, నాగయ్య, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, టైపిస్టులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిఐ పిఆర్‌ఒగా బాధ్యతలు స్వీకరించిన పద్మజ

సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా సహాయ సంచాలకులు (ఎడి)గా పద్మజ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో సహాయ సంచాలకులు గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం సాధారణ బదలీపై కడప జిల్లాకు వచ్చానని చెప్పారు. జిల్లాలో ఎడిగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సలహాలు, సూచనలు పాటిస్తూ శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

విమాన ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వందలాది మంది మృతి చెందడం బాధాకరమని జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణంలో విద్యార్థులు విమాన ప్రమాద మృతులకు నివాళి అర్పించారు. 2 నిమిషాలు మౌనం పాటించారు. ఆకస్మికంగా ఇటువంటి ఘోర ప్రమాదం జరగడం బాధాకరమని పేర్కొన్నారు. దాదాపు 250 మందికి పైగా విదేశీయులు, స్వదేశీయులు, చిన్నారులు మృతి చెందడం బాధాకరమని చెప్పారు. మృతి చెందిన వారికి నివాళి అర్పిస్తూ వారి కుటుంబాలకు విద్యార్థులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, గైడ్ టీచర్ పునీత్, సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఆరోగ్యవంతులుగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం 'ప్రపంచ రక్తదాత దినోత్సవము'లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఎపిఎస్ ఎసిఎస్ వారి ఆదేశాల మేరుకు కడప స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, రీజినల్ బ్రాంచ్, ప్రభుత్వ రక్త నిధి, ప్రభుత్వ సర్వోజన ఆసుపత్రి కడప వారి సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాత దినోత్సవం ప్రతి సంవత్సరమూ లాగే ఈ ఏడాది కూడా 14వ తేదీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. 'కార్ల్ లాండ్ స్టైనేర్' జన్మ దినాన్ని పురుస్కరించుకుని 2004వ సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. స్వచ్ఛంద రక్తదాతందలరీని కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ రక్తదాతల కార్యక్రమాన్ని ప్రభుత్వ సర్వజనని ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్, ఈతరం బ్లడ్ బ్యాంకు వారు వారం రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ రవి బాబు, బ్యాంకు చీఫ్ మేనేజర్ కృష్ణ కిషోర్, బ్యాంకు మేనేజర్ అనిల్ కుమార్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

ఉత్తమ మార్పు తీసుకురావడమే లక్ష్యం

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థుల అభ్యసనంలో ఉత్తమ మార్పు తీసుకురావడమే లక్ష్యమని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను ప్రధానోపాధ్యాయులు నాగమణితో కలిసి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు, కడప ఎమ్మెల్యే మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల అభ్యున్నతి కోసం 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరిట యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, టై, షూ, డిక్షనరీతో కూడిన కిట్టు పంపిణీకి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు.

విద్యార్థికి నగదు అందజేస్తున్న దాత శివశంకర్‌రెడ్డి

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన అమరావతి అనే విద్యార్థికి దాత శివశంకర్ రెడ్డి నగదు అందజేశారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో పాములూరు ప్రభుత్వ పాఠశాలలో చదివే అలవలపాడు గ్రామానికి చెందిన కేశవరెడ్డి కుమార్తె అమరావతి అత్యధిక మార్కులు సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పాములూరు గ్రామానికి చెందిన దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి అనే దాత ప్రధానోపాధ్యాయురాలు సౌభాగ్య లక్ష్మి చేతుల మీదుగా విద్యార్థి అమరావతికి ప్రోత్సాహం కింద నగదు అందించారు. 1988 నుండి పాములూరు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు శివ శంకర్ రెడ్డి ప్రోత్సాహక బహుమతి కింద నగదును అందజేస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు. దాతల సహకారాన్ని విద్యార్థులు ఎన్నటూ మర్చిపోరాదని అన్నారు. ఇలాంటి దాతలు ఉండడం వల్లే ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఎంతో ఆసరా ఉంటున్నారు. దాతృత్వం అనేది ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. అమరావతి అనే విద్యార్థిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని రాబోయే పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఉపాధ్యాయులు ఉన్నారని కాబట్టి ప్రతి రోజు పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసించాలని దాత శివశంకర్ రెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి పాఠశాలకు మంచి పేరు తేవాలని చెప్పారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సభ్యుడు గంగాధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ అందిస్తున్న రఘునాథ్ రెడ్డి

రైతన్నలకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- లింగాల

నూతన విధానంలో భాగంగా వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో లక్ష్మి వెంకటేశ్వర రైతు మిత్ర బృందం సభ్యులకు 80 శాతం రాయితీతో వ్యవసాయ డ్రోన్ పరికరాలను శుక్రవారం వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డితో కలసి కార్యాలయంలో పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ సాయంతో వ్యవసాయాన్ని సులువుగా, లాభదాయకంగా మార్చేందుకు దోహదపడుతుందని తెలిపారు తక్కువ సమయంలో ఎక్కువ విస్తరణలో మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు యువ రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీ పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు

విద్యుత్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : చేనేత కార్మికులకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ సబ్సిడీ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం విద్యుత్ ఉప కేంద్రం ఎఇ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గుంత, కరెంట్ మగ్గం నేస్తున్న అర్హులైన నేతన్నలు విద్యుత్ రాయితీ కోసం ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, చేనేత గుర్తింపుకార్డు కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తెలుగు భాషా సౌరభాలు పుస్తకం అందజేత

ప్రజాశక్తి- ఖాజీపేట : ఖాజీపేట పట్టణానికి చెందిన చరిత్ర కారుడు షేక్. ఇంతియాజుద్దీన్‌కు తెలుగు భాషా సౌరబాల పుస్తకాన్ని శుక్రవారం హిస్టరీ ప్రొఫెసర్ నాగభూషణ శర్మ అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణ శర్మ మాట్లాడుతూ సర్ థామస్ మన్రో చరిత్ర పుస్తకాన్ని తాను రచించానని తెలిపారు. నేటితరం యువత చరిత్రను పూర్తిగా మర్చిపోతుందని, యువతకు చరిత్ర గురించి తెలపాలన్న ఉద్దేశంతోనే తాను రచనలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా చరిత్రకారుడు షేక్ ఇంతియాజిద్దీన్ ఆయన్ను ఘనంగా సన్మానించారు.

మండల వ్యవసాయ శాఖ అధికారి బదిలీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈయన జోన్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తుండగా డిప్యూటేషన్‌పై సింహాద్రిపురం వచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇక్కడకు నంద్యాల డిఎఒ ఆఫీస్ నుంచి కళ్యాణ్ కుమార్ బదిలీపై ఇక్కడికి రానున్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి–రాయచోటి: వివిధ కారణాలవల్ల చదువు మానేసిన వారు పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఎపి ఓపెన్ స్కూల్ ద్వారా ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పిం చిందని అన్నమయ్య జిల్లా డిఇఒ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం ఆయనమాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలు ద్వారా విద్యార్థులు పొందే ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ విద్యార్థులతో సమా నమైన గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ అర్హత పొందిన వారు ఎలాంటి ఉద్యోగా నికైనా అర్హులేనని, చదువుపై ఆసక్తి ఉండి ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా స్థిరపడి ఉన్నారన్నారు.ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31 వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయసు నిండి ఉండాలని, చదవడం, రాయడం తెలిసి ఉండాలని, ఏదో ఒక తరగతి టిసి, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డును కలిగి ఉండాలన్నారు. ఇంటర్ ప్రవేశానికి 10వ తరగతి మార్కుల జాబితా 10వ తరగతి టిసిని దరఖా స్తుతో పాటు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు వికలత్వం అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు.

కెసి కెనాల్ కాలువలో పూడిక తీత

ప్రజాశక్తి - చెన్నూరు : చెన్నూరు కెసి ఆయకట్టు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు కెసి కాలువలో పూడికతీత పనులు చేపట్టామని కెనాల్ డిసి ప్రెసిడెంట్ తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి(బుజ్జన్న) పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెసి కాలువలో దాదాపుగా పదేళ్ల నుంచి ఎటువంటి పనులు చేపట్టలేదని తెలిపారు తమ నాయకుడు నరసింహారెడ్డి దృష్టికి కొంతమంది రైతుల కెనాల్ సమస్యలు తెలపడంతో ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాలతో కెసిఆర్ఒ పనులు చేపట్టామన్నారు.

పూడికతీత పనులు పరిశీలిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

నవధాన్యాల సాగుతో లాభదాయకం

ప్రజాశక్తి - వల్లూరు

వరి పంట సాగు చేసే ముందు నవధాన్యాలు సాగు చేసుకోవడం వల్ల ఎరువుల వాడకం తగ్గించవచ్చని, దీని ద్వారా లాభదాయకం ఎక్కువగా ఉంటుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దపుత్త గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ తాడిగొట్ల రాఘవరెడ్డి పొలంలో పిఎండిఎస్ నవధాన్య సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రధానంగా ప్రధాన పంట వేసే ముందుగా నవధాన్యాలు సాగు చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని రైతులకు వివరించారు. ప్రధానంగా భూమిలో సారవంతమైన పంట వచ్చే విధంగా అధిక తెగుళ్లను అరికట్టవచ్చని చెప్పారు. భూమిలో ఉన్న సూక్ష్మజీవులకు ఆహారంగా పెంపొందించవచ్చు వీటివల్ల అధిక దిగుబడి తీసుకోవచ్చని తెలిపారు. నవధాన్యాల సాగు చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. పెద్దపుత్త గ్రామంలో మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి రైతును ఆదర్శంగా తీసుకొని చుట్టుపక్కల రైతులు పిఎండిఎస్ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, గ్రామ రైతులు బాలిరెడ్డి, ఎన్ ప్రొఫెసర్ భరత్ కుమార్ రెడ్డి, ఎన్ఎఫ్ఎ నరసింహారెడ్డి, ఎన్‌టి వెంకటరామిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ఓబులయ్య, చంద్రశేఖర్, ఇంటర్నల్ కమిటీ రీసెర్చ్ పర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

నవదాన్యాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు

విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ముక్తియార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ప్రొద్దుటూరు పట్టణం జిన్న రోడ్డు ఉర్దూ మున్సిపల్ హై స్కూల్‌లో మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురికి అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షులు ముక్తియార్, మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్‌డి అయూబ్ ఖాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మంచి ఫలితాలు సాధించిన అష్రఫ్‌కు రూ. 5 వేలు, సుహానకు రూ.3 వేలు, ఫరీఫాకు రూ.2 వేలు ప్రోత్సాహక బహుమతులు అందించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముక్తియార్ మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించి చదువుతున్న పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, ప్రధానోపా ధ్యాయులు ఇమామ్ హుస్సేన్, విద్యా కమిటీ చైర్మన్ లాలూ, మూర్తుజా హుస్సేన్, గౌస్ లాజం, డాక్టర్ గౌస్ మొహిద్దీన్, పవన్ అలీ, యూసుఫ్, బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మార్చిలో నిర్వహించిన పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తుందని ఎంఇఒ నాగేశ్వర నాయక్ తెలిపారు. స్థానిక ఎంఇఒకార్యాలయంలో శుక్రవారం నాగేశ్వర నాయక్ విద్యార్థులకు రూ20వేల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికలఉన్నత పాఠశాల విద్యార్థి వైష్ణవి సుజిత, మహర్షి, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు తేజస్,కీర్తన మరి కొందరికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చతికిల పడ్డ డబుల్ ఇంజిన్ సర్కార్

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతూ అభివృద్ధిలో చతికిల పడిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ దూసుకు పోతున్నదని టిడిపి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని చెప్పారు. 2023- 24 లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రూ 34,698 కోట్లు కాగా 2024–25 లో రూ 20,135 కోట్లు మాత్రమే వచ్చిందని చెప్పారు. దీని ప్రకారం చూస్తే రూ 14,563 కోట్లు తగ్గిందని తెలిపారు. సంజీవినీ లాంటి ప్రత్యేక హోదా రాలేదని చెప్పారు. సీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రాలేదని తెలిపారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం కాలేదని అన్నారు. దుగ్గరాజపట్నం ఓడ రేవు నిర్మాణం కూడ చేపట్ట లేదని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్ ఇవ్వలేదని అప్పు తెచ్చుకోమని చెపుతున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం పనులు నత్త నడకన సాగుతున్నట్లు చెప్పారు. 9,10 షెడ్యూల్లోని సంస్థలు రాష్ట్రానికి రాలేదని తెలిపారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు రాలేదని చెప్పారు. 2023–24 కంటే 2024–25 మూల ధన వ్యయం రూ 4,413 కోట్లు తగ్గిందని చెప్పారు. ఒక్క ఏడాదిలోనే రూ 1,58,604 కోట్ల అప్పు చేసిందని చెప్పారు. జిఎస్‌టి వసూళ్ల అన్ని రాష్ట్రాల్లో పెరుగుతూ ఉంటే మన రాష్ట్రంలో తగ్గుతున్నాయని చెప్పారు. ధరలు పెరగడంతో ప్రజల నుండి కొనుగోలు శక్తి తగ్గిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాకతో రియల్ ఎస్టేట్ కూడా భారీగా పతనమైందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు దూసుకు పోతున్నట్లు చెప్పారు.

ఘనంగా దస్తగిరి స్వామి పండగ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లెలో శుక్రవారం దస్తగిరి స్వామి పండుగను నిర్వహించారు. దర్గా వద్ద వెదురు జెండాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు ఐక్యంగా దస్తగిరి స్వామి పండుగను నిర్వహించారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో దస్తగిరి స్వామి పండుగలో పాల్గొన్నారు.

సబ్‌జైల్ సూపరింటెండెంట్‌గా గంగాధర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సబ్ జైల్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ఎస్ఐ డి. గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కొండాపురం మండల నివాసి అయిన గంగాధర్ 2018 లో ఎస్ఐగా ఎంపికై మొదట సారీ గుంటూరు జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు చోట్ల పని చేస్తూ కమలాపురం సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయ్యవారురెడ్డి బదిలీ అవ్వడంతో సూపరింటెండెంట్‌గా గంగాధర్‌ను పులివెందుల సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా ఇన్‌ఛార్జిగా నియమించారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వేముల : డ్వాక్రా మహిళలకు రుణాలు వెంటనే మంజూరు చేసి వారి జీవనోపాదులను పెంపొందించాలని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో యూనియన్, ఎపిజిబి బ్యాంకు మేనేజర్లతో డ్వాక్రా రుణ వార్షిక ప్రణాళిక అమలు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 –26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళిక ప్రకారం అర్హత ఉన్న డ్వాక్రా సంఘాలకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరారు. డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే మహిళలకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. వేముల మండలం వ్యాప్తంగా ఆసక్తి ఉన్న రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జయచంద్ర, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, నాగేశ్వరి, గంగరాజు, మండల సమాఖ్య అకౌంటెంట్ చిన్న రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం పుస్తకాలు, యూనిఫామ్‌లు ఎంఇఒ- 2 శారద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన పుస్తకాలు, యూనిఫామ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్ ప్రభు కుమార్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర బృందం పాల్గొన్నారు.

పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ఖాజీపేటలో చిత్రటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

ముఖ్యమంత్రికి పాలాభిషేకం

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పాత బస్టాండు సర్కిల్ లోని గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టిఎన్ఎస్ఎఫ్, టిడిపి నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్రఅధికార ప్రతినిధి నవీన్ రాయల్ , టిడిపి నాయి బ్రాహ్మణ కడప పార్లమెంట్ అధ్యక్షులు గజ్జల గోవిందులు మాట్లాడుతూ ప్రతి తల్లికి ఎంతమంది పిల్లలు చదువుతున్న అందరికీ కూడా వారి ఖాతాల్లో రూ. 13000 చొప్పున జమ చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్‌లోని అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తూ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఐ.ఎల్ చిన్న, నాని, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి సిద్దు రాయల్, టిఎన్ఎస్ఎఫ్ జమ్మలమడుగు అధ్యక్షులు చామంతి మహేష్, పార్థసారథి, మధు, ప్రసాద్, యువ, ప్రతాప్ పాల్గొన్నారు.

ఖాజీపేట : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తుందని కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రెడ్యం రవీంద్రారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పల్లె గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్లూరులో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఖాతాలో నగదు జమ కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు, స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా అర్హత మేరకు అందరికీ నిధులు జమ చేశారన్నారు.

రక్తదాతకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

ప్రపంచ రక్త దాతల దినోత్సవ వేడుకలు సందర్భంగా మైదుకూరు నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌సిసి ఆస్పత్రి సహకారంతో ఎ–1 మినీ కల్యాణ మండపంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త దాతలను మెమెంటో సర్టిఫికెట్ శాలువా తో సత్కరించారు. 21సార్లు రక్త దానం చేసిన రక్త దాత గురు మోహన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. రక్తదాత మాట్లాడుతూ ఎవరైనా ప్రమాదాల్లో ఉన్నప్పుడు సమాచారం రాగానే రక్తదానం ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. యువకులు ప్రతి ఒక్కరూ రక్తదానానికి సహకరించాలని తెలిపారు.

గురుమోహన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

వంతెన పై ఓవైపు దెబ్బతిన్న గోడ

ప్రమాదకరంగా రక్షణ గోడలు

ప్రజాశక్తి- ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు వద్ద బెస్తకాలనీ సమీపంలో నీటిపారుదల వాగుపై నిర్మించిన రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థిలు సైతం సైకిళ్లపై పాఠశాలలకు వెళుతుంటారు. వర్షాకాల సమయంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. చాలా కాలం నుంచి రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్న అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

తల్లికి వందనం అర్హులు, అనర్హుల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - చాపాడు : తల్లికి వందనం పథకానికి సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాను సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. గురువారం తల్లికి వందనం పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విధివిధానాలు విడుదల చేసిన విషయం తెలిసినదే. అందులో భాగంగా 1వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదివే విద్యార్థులకు సంబంధించి అర్హులైన విద్యార్థుల పేర్లు, వివరాలను అలాగే అనర్హుల విద్యార్థుల వివరాలను ప్రకటించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సచివాలయాలకు వెళ్లి తమ పిల్లల పేర్లు ఉన్నాయా లేదో పరిశీలన చేసుకుంటున్నారు ఏవైనా సమస్యలు ఉన్న విద్యార్థులు వాటిని పరిష్కరించుకోవాలని సిబ్బంది సూచించారు.

కాలనీలో పర్యటిస్తున్న పోలీసులు

వెంకట సుబ్బయ్య కాలనీలో నాకాబందీ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటసుబ్బయ్య కాలనీలో అర్బన్ సిఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలను తనిఖీ చేశారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఘర్షణలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, వనిపెంట, దువ్వూరు మండలాలలో రెండవ శనివారం 220 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్ కో డిఇఇ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. **ఖాజీపేటలో..**మండల వ్యాప్తంగా విద్యుత్ మరమ్మతు పనులు దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఇంజనీర్ నాగరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులో 220 కెవి విద్యుత్ స్టేషన్‌లో పనులు జరుగుతున్న దృష్ట్యా సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. **ఎర్రగుంట్లలో..** పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల మీద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం వంటి పనులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, రాణివనం, ప్రొద్దుటూరు రోడ్డు, వినాయక నగర్, సుందరయ్య నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. **ముద్దనూరులో..**ముద్దనూరు ఉప విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముద్దనూరు, ఉప్పలూరు, బొందలకుంట,మంగపట్నం గ్రామాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు. **పులివెందులలో..** ఉదయం 8 గంటల నుండి 12.00 గంటల వరకు 11 కె.వి లైన్స్ కింద చెట్లను తొలగించు కార్యక్రమం ఉన్నందున విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇలు జగదీశ్వర్ రెడ్డి, రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద రంగాపురం సబ్ స్టేషన్ నుంచి ఆర్.తుమ్మలపల్లి ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్ ఇ. కొత్తపల్లి సబ్‌స్టేషన్ నుంచి మోట్నూతలపల్లి ఫీడర్. నల్లపురెడ్డిపల్లి సబ్ స్టేషన్ నుంచి నల్లగొండ వారి పల్లి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఉదయం 9 నుంచి 11 వరకు అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులందరూ సహకరించాలని కోరారు. **చెన్నూరులో..** రెండో శనివారం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చెన్నూరు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ రామలింగారెడ్డి ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు సహకరిం చాలన్నారు. **కడప నగరంలో..** విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో ఈనెల 14వ విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు టూటౌన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ బి. లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్య నగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులకు కలిగే ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

IN THE COURT OF THE IInd Addl. DISTRICT JUDGE, PRODDATUR

I.A.No. 942/2022

O.S.No. 31/2021

Kalluru Venkata Reddy, S/o Pedda Venkata Reddy, aged 56 years, Hindu, R/o D.No.14/333, Mydukur Road, Proddatur Town, Kadapa Dist. **...Petitioner**

Vs

14. Gummalla Prasanna, D/o Late Pulla Reddy, Aged 33 years, Hindu, House wife, R/o D.No.15/930, Modameedapalli Street, Proddatur Town, Kadapa Dist. **...Respondent No.14**

నోటీసు

ఈ నెంబరు I.A.No.942/2022 నందు రెస్పాండెంట్ నెం.14 అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమేమనగా మీరు హాజరు అగుటకుగాను 30.06.2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటూ ఉన్నది. పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥ మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవలెను. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 30.6.2025.

//By Order of the Court//

B.C.MADAIAH, LL.M.,
Advocate,
Proddatur.